# ‘పోచారం సారుకే మద్దతు’

**గ్రామాల్లో స్వచ్ఛందంగా ఫ్లెక్సీల ఏర్పాటు**



జల్లాపల్లి(ఓల్డ్ విలేజ్)లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ



నస్రుల్లాబాద్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని పరిశీలిస్తున్న స్పీకర్ పోచారం


కోటగిరి, నవంబర్ 19 : బాన్సువాడ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డికి గ్రామాల్లో మద్దతు పెరుగుతున్నది. పొతంగల్ మండలం జల్లాపల్లి (ఓల్డ్ విలేజ్) గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశారని, అసెంబ్లీ ఎన్నికల్లో పోచారం శ్రీనివాస రెడ్డికే తమ మద్దతు అని... కారు గుర్తుకే ఓటు వేసి గెలిపిస్తామని ఏక గ్రీవ తీర్మానం చేశామని.. ఇతర పార్టీల నాయకులు గ్రామానికి వచ్చి ఇబ్బంది పెట్టొద్దని ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు.

**మా కుటుంబ సభ్యుల ఓట్లు పోచారం సారుకే..**

నస్రుల్లాబాద్ : మా కుటుంబ సభ్యుల ఓట్లు మా ఇంటి పార్టీ, మా ఆత్మబంధువు పోచారం శ్రీనివాస రెడ్డికేనని కామారెడ్డి జిల్లా నస్రుల్లా బాద్ మండల కేంద్రానికి చెందిన సయ్యద్ అన్వర్ తన ఇంటి గేటుకు ఫ్లెక్సీని ఏర్పాటు చేశాడు. ఆదివారం ఎన్నిక ప్రచారంలో భాగంగా ప్రచారానికి వచ్చిన స్పీకర్ పోచారం ఫ్లెక్సీని చూసి అన్వర్‌ను అభినందించారు.

# హస్తం హత్యా రాజకీయం

## గండివేట్ కత్తిపోట్ల ఘటనతో తేటతెల్లం



నిజామాబాద్, నవంబర్ 19(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ పార్టీ హత్యా రాజకీయాలను ప్రేరేపిస్తోంది. ప్రజల్లో వారిపై సానుకూల పవనాలు లేకపోవడంతో ఉద్రిక్తతలను పెంచి పోషించి తద్వారా లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నది. ఈ రకంగా హింసాత్మక ఘటనలతో ఎన్నికల్లో రాజకీయ ప్రయోజాన్ని దక్కించుకునేందుకు హస్తం పార్టీ పాకులాడుతున్నది. ఇందుకు కామారెడ్డి జిల్లా గాంధారి మండలం గండివేట్ గ్రామంలో శనివారం రాత్రి జరిగిన కత్తిపోట్ల ఘటనే సాక్షాత్కారంగా నిలుస్తున్నది. కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు ఏకంగా గ్రామంలోని బీఆర్ఎస్ పార్టీకి చెందిన ముగ్గురు మైనార్టీ నాయకులపై కత్తితో దాడి చేయడం కలకలం రేపుతున్నది. ఇదంతా కుట్రపూరితంగా జరుగుతున్నట్లుగా ప్రజలు భావిస్తున్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో శాంతియుతమైన పరిస్థితిలో ఎన్నికల ప్రచారాన్ని బీఆర్ఎస్ చేస్తున్నది. ఎమ్మెల్యే జాజాల సురేందర్ నేతృత్వంలో శ్రేణులతో భారీ మెజార్టీ లక్ష్యంగా దూసుకుపోతుండడం తో ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ గెలిచే అవకాశమే లేకపోవడంతో హత్యా రాజకీయాలకు తెరలేపినట్లుగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**దాడులకు ముందస్తు ప్రణాళిక...**

తాజా రాజకీయ పరిస్థితులతో కాంగ్రెస్ పార్టీకి ఆశలు చల్లబడడంతో చేసేది లేక కుట్రలకు తెరలేపినట్లుగా అనుమానాలు బలపడుతున్నాయి. నవంబర్ 30న పోలింగ్ ఉండడంతో సరిగ్గా పది రోజుల ముందు కత్తిపోట్ల ఘటన ఒక మారుమూల పల్లెలో జరగడం అన్నది హస్తం పార్టీ కీలక నేతల ప్రమేయం ఉంటుందన్న అనుమానాలకు దారితీస్తున్నది. సోషల్ మీడియా సంబంధిత అంశాల్లో తలెత్తిన చిన్న పాటి విషయాన్ని ఏకంగా ప్రాణాలు తీసేంతగా మార్చడం అన్నది కాంగ్రెస్ పార్టీ నేతల ప్రోద్బలం ఉందన్నది ప్రజల్లో చర్చ జరుగుతున్నది.

### బీఆర్ఎస్ మైనార్టీ నేతలపై దాడి హేయం



మైనార్టీలంతా ఏకమై కేసీఆర్ నాయకత్వాన్ని బలపర్చేందుకు సిద్ధమైన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ జీర్ణించుకోలేక పోతున్నది. ఈ దుస్థితిలోనే హస్తం పార్టీ నేతలంతా ఇలాంటి వక్రబుద్ధిని ప్రదర్శిస్తున్నారు. ఏకంగా ముగ్గురు మైనార్టీ లీడర్లను కత్తితో పొడవడం అన్నది కాంగ్రెస్ హింసా రాజకీయాలను తేటతెల్లం చేస్తున్నది. కాంగ్రెస్ అవలంబిస్తున్న ఘోరమైన చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాం. ప్రజలంతా కాంగ్రెస్ చేస్తున్న నీచమైన పనులను ఖండించాలని, ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని కోరుతున్నాను.

**- ముజీబుద్దీన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, కామారెడ్డి**

**ప్రాణాపాయ స్థితిలో బీఆర్ఎస్ నేతలు...**

కత్తిపోట్ల ఘటనలో భీందాస్ చేతిలో బీఆర్ఎస్ మైనార్టీ నేతలు హైమద్, జావిద్, రజాక్ తీవ్రంగా గాయపడ్డారు. దీంతో ఎమ్మెల్యే జాజాల క్షతగాత్రులను దవాఖానకు తీసుకెళ్లి వైద్యం చేయించారు. కాగా హైమద్ ఊపిరితిత్తులకు గాయం కావడంతో ఆపరేషన్ చేశారు. కాంగ్రెస్ చేస్తున్న వికృత క్రీడను ఎమ్మెల్యే జాజాల తీవ్రంగా ఖండించారు. ఎన్నికల్లో ప్రజాస్వామ్యబద్ధంగా గెలవలేకనే కాంగ్రెస్ పార్టీ కుట్రలకు తెగబడిందన్నారు. హస్తం పార్టీ ఎంతటి దిగజారుడు రాజకీయాలకు పాల్పడినా వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా బీఆర్ఎస్‌నే గెలిపిస్తారని చెప్పారు. ఈ హత్యా రాజకీయాలను ప్రజలంతా గమనిస్తున్నారని తెలిపారు. ఘటనపై ప్రజలంతా తీవ్రంగా ఖండిస్తుండగా కాంగ్రెస్ పార్టీ మాత్రం నోరు విప్పలేదు. ఇలాంటి హింసాత్మకమైన ఘటనలను కాంగ్రెస్ ప్రోత్సహిస్తుందన్న వాదనకు హస్తం పార్టీ నేతల తీరు బలం చేకూరుస్తున్నది.

**నిందితుడిపై కేసు నమోదు..**

గాంధారి,ఎల్లారెడ్డి 19: గండివేట్‌లో బీఆర్ఎస్ కార్యకర్తలపై కత్తితో దాడి చేసి గాయపరిచిన కాంగ్రెస్ పార్టీ గ్రామాధ్యక్షుడు భీందాస్‌పై, బాధితుడు హైమద్ ఇచ్చిన స్టేట్‌మెంట్ ప్రకారం కేసు నమోదు చేసినట్లు గాంధారి ఎస్సై ప్రేమ్‌దీప్ తెలిపారు. ప్రస్తుతం నిందితుడు కామారెడ్డిలోని ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతున్నాడని, త్వరలోనే అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తామన్నారు. గండివేట్‌లో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు.

## బీఆర్ఎస్ నాయకులపై బీజేపీ కార్యకర్తల దాడి

డిచ్‌పల్లి, నవంబర్ 19: ఎన్నికల ప్రచారానికి వెళ్లిన బీఆర్ఎస్ నేతలపై బీజేపీ కార్యకర్తలు దాడి చేయడంతో డిచ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. బీఆర్ఎస్ నేతల కథనం ప్రకారం.. డిచ్‌పల్లి మండలంలో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మెంట్రాజ్‌పల్లి, నాక తండా, వడ్డెరకాలనీ, అమృతాపూర్ గ్రామాలకు వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. అమృతాపూర్‌లో ఎన్నికల ప్రచారం చేస్తుండగా కొందరు బీజేపీ కార్యకర్తలు వచ్చి బీఆర్ఎస్ నాయకులతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలోనే తమపై దాడికి యత్నించారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాళ్ల సురేశ్, విజయ్, రమణ, బాలయ్యతోపాటు మరో ఆరుగురు ఒక్కసారిగా తమపై దాడికి యత్నించగా, తన చేతివేలికి గాయమైందని ఫిర్యాదులో పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న సీఐ కృష్ణ, ఎస్సై మహేశ్ అమృతాపూర్‌కు వెళ్లి వివరాలు సేకరించారు. అనంతరం బీజేపీ కార్యకర్తలు సురేశ్, రమణ, బాలయ్య, విజయ్, శ్రీధర్, అర్వింద్‌తో పాటు మరికొందరిపై కేసు నమోదు చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఈసీ అనుమతితో నిర్వహించే ర్యాలీలను ఇతర పార్టీల వాళ్లు ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటే కేసులు నమోదు చేస్తామన్నారు.

# బీసీలకు న్యాయం చేస్తోంది బీఆర్ఎస్సే..




- అన్నం పెడుతున్న వారికి అండగా నిలుస్తాం
- మున్నూరు కాపులకు 10 సీట్లు ఇచ్చింది కేసీఆరే..
- బీసీ అధ్యక్షుడిని తొలగించి బీసీ జపం చేయడం న్యాయమా?
- నందిపేటలో మున్నూరు కాపు ఫంక్షన్‌హాల్ కవితమ్మ ద్వారానే సాధ్యమైంది
- మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య పటేల్

కమ్మర్‌పల్లి, నవంబర్ 19:

**రాజకీయాల్లో ప్రాధాన్యమిచ్చిన పార్టీ ఏది?**

బీఆర్ఎస్ పార్టీ 10మంది మున్నూరు కాపు బిడ్డలకు టికెట్లు ఇచ్చి, రాజకీయంగా ప్రాధాన్యమిచ్చింది. ఇద్దరికి ఎమ్మెల్సీ, ఇద్దరికి రాజ్యసభ, ముగ్గురికి జడ్పీ చైర్మన్, ఒకరికి మేయర్ పదవి ఇచ్చి మున్నూరు కాపులను సీఎం కేసీఆర్ గౌరవించారు. కాంగ్రెస్ పార్టీ మూడు సీట్లు మాత్రమే ఇచ్చింది.

**ఉమ్మడి జిల్లాలో మున్నూరు కాపులకు దక్కిన గౌరవం ఏమిటి?**

నిజామాబాద్ ఉమ్మడి పార్లమెంటు పరిధిలో కాంగ్రెస్ పార్టీ బీసీలకు న్యాయం చేయలేదు. బీఆర్ఎస్ పార్టీ మాత్రం బాజిరెడ్డి గోవర్ధన్‌కు టికెట్ ఇచ్చింది. గత ఎన్నికల్లో సైతం బాజిరెడ్డికి టికెట్ ఇచ్చి టీఎస్ ఆర్టీసీ చైర్మన్‌ను చేసింది. ఆయన హయాంలోనే ఆర్టీసీని ప్రభుత్వ పరం చేసి అందులో 42వేల మంది కార్మికులకు భరోసా అందించింది. ఇదంతా మున్నూరు కాపు బిడ్డ హయాంలో జరగడం తాము గర్వకారణంగా భావిస్తున్నాం. దీనికి సీఎం కేసీఆరే కారణం.

**మున్నూరు కాపులకు ఎమ్మెల్సీ కవిత ఏం చేశారు?**

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మున్నూరు కాపులకు అండగా నిలిచారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా..అదీ మండల స్థాయిలో నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గంలోని నందిపేటలో రూ.5కోట్లతో అద్భుతమైన ఫంక్షన్ హాల్ మాకు వరంగా అందింది. ఇది బీసీలకు కవితమ్మ అందించిన చేయూత. అందుకే సాయం చేసిన వారికి, అన్నం పెట్టిన వారికి అండగా ఉండాలి. రూ.5కోట్లతో ఫంక్షన్ హాల్ అందించినందుకు కృతజ్ఞత సభ నిర్వహిస్తే పది వేల మంది మున్నూరు కాపు బిడ్డలు ఉత్సాహంగా తరలివచ్చారు. ఇదే బీఆర్ఎస్‌పై ఉన్న మా అభిమానానికి నిదర్శనం.

**బీసీ జపం చేస్తున్న బీజేపీపై మీ వైఖరి?**

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బీసీ బిడ్డను తొలగించిన బీజేపీ పార్టీ.. ఇప్పుడు ఎన్నికల్లో గెలిచేందుకు బీసీ జపం చేయడం న్యాయం కాదు. బీసీ బిడ్డ ప్రధానిగా ఉన్న సమయంలో ఆయనను తొలగించి ఏ సామాజిక వర్గానికి కుర్చీ కేటాయించిందో అందరం చూశాం. వారి మాటలు నమ్మే ప్రసక్తే లేదు.

**బీసీలకు, మున్నూరు కాపులకు మీరిచ్చే సూచన?**

బీసీలకు, మున్నూరు కాపుల సంక్షేమానికి కృషి చేస్తున్న బీఆర్ఎస్ పార్టీకి అండగా ఉండాల్సిన తరుణం వచ్చింది. ఏ పార్టీ పేద, మధ్యతరగతి వారు ఉండే బీసీలకు న్యాయం చేస్తున్నదో అర్థం చేసుకొని అండగా ఉండాల్సిన అవసరం ఉన్నది. మున్నూరు కాపు కార్పొరేషన్ కల సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమవుతుంది. మాకు సంపూర్ణ విశ్వాసం ఉన్నది.

**బీసీలకు బీఆర్ఎస్ ఏం చేసింది?**

బీసీల్లో సమాజానికి అన్నం పెట్టే రైతులున్నారు. వారికి సాగునీటిని, పంట పెట్టుబడి సాయాన్ని అందిస్తున్నది. ఇది బీసీల ఉన్నతికి ఉపయోగపడుతున్నది. ఆసరా పింఛన్లు బీసీలకు అండగా నిలిచే గొప్ప పథకం. పేదింటి ఆడబిడ్డకు కల్యాణ లక్ష్మి కింద లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించడంలో బీసీ కుటుంబాల్లో ఆడబిడ్డలకు అందుతున్న చేయూత. ఆసరా, కల్యాణలక్ష్మి, బీడీ పింఛన్లు, రైతుబంధు తదితర పథకాలు లక్షలాది మంది బీసీలకు భరోసానిస్తున్నాయి. చేయూతనిచ్చే పథకాలు బీఆర్ఎస్ ద్వారా అందుకుంటున్నాం. అందుకే బీఆర్ఎస్‌తోనే అన్నింటా న్యాయం జరుగుతుందని భావిస్తున్నాం.

**బీఆర్ఎస్‌పై బీసీలకు ఎందుకంత ప్రేమ?**

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతోనే బీసీల్లో సహజంగానే బీఆర్ఎస్‌పై సానుకూలత ఉన్నది. ఆ సానుకూలతతో వారి ఆకాంక్షలను గుర్తించి బాధ్యతగా వ్యవహరిస్తున్నది బీఆర్ఎస్ పార్టీయే. రాజకీయంగా, బీసీ కులవృత్తులకు పూర్వ వైభవం తెచ్చేలా సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న అమలు చేస్తున్న పథకాలు అల్టిమేట్‌గా పేదలకు బుక్కెడు అన్నం పెట్టేవిగా ఉన్నాయి. పేదలకు అన్నం పెట్టే వారికి మద్దతు పలకడమే న్యాయం. బీసీల్లో బీఆర్ఎస్, కేసీఆర్‌పై విశ్వాసం నెలకొనడానికి ఆ బుక్కెడు అన్నం పెట్టే మానవీయ పథకాలే కారణం.



నందిపేటలో నిర్మించిన మున్నూరు కాపు ఫంక్షన్‌హాల్